క్లుప్తంగా

లైసెన్స్‌లు రద్దు చేయిస్తాం..



హెల్మెట్ వాడకం ఆవశ్యకతను వివరిస్తున్న సీఐ, తదితరులు

పాలకొండ రూరల్: మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడితే డ్రైవింగ్ లైసెన్సులు రద్దు చేయిస్తామని సీఐ ఎం.చంద్రమౌళి స్పష్టం చేశారు. పాలకొండ – సీతంపేట, రాజాం, వీరఘట్టం వెళ్లే రహదారుల్లో ఆదివారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్రువపత్రాలు పరిశీలించడంతో పాటు డ్రంకన్ డ్రైవ్ పరీక్షలు చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన పలువురికి అపరాధ రుసుం విధించారు. హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించారు. తనిఖీల్లో ఎస్సై కె.ప్రయోగమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

కానరాని పారిశుధ్య పనులు



కోమటిపేట -గొల్లవీధి కూడలిలో పేరుకుపోయిన చెత్త

పాలకొండ రూరల్: గడిచిన మూడు రోజులుగా నగర పంచాయతీ పరిధిలోని పలు వార్డుల్లో పారిశుధ్య పనులు చేపట్టకపోవడంతో ఎక్కడబడితే అక్కడే చెత్త పేరుకుపోయింది. దీంతో దుర్వాసన, దోమలతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. యుద్ధప్రాతిపదికన చేపట్టాల్సిన పారిశుధ్య పనుల్లో చోటుచేసుకుంటున్న జాప్యం అధిగమించడంలో పాలకులు, అధికారులు విఫలమవుతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఎటువంటి అంటురోగాలు ప్రబలక ముందే అధికారులు స్పందించి పారిశుధ్య పనులు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు

సీతానగరం: మండల కేంద్రంలో నిరంతరం విద్యుత్ సమస్యలను ఎదుర్కొంటున్న హడ్కో కాలనీలో ఉన్న ట్రాన్స్‌ఫార్మరు ఆదివారం మరమ్మతులు చేపట్టారు. తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్న కారణంగా విద్యుత్ వినియోగదారులు ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేపట్టి నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోవాలని కోరడం వల్ల ఏఈ విశ్వేశ్వరరావు స్పందించి సిబ్బంది సహకారంతో మరమ్మతులు చేశారు. దీంతో గృహావసరాలకు విద్యుత్ పునరుద్ధరించినట్లు స్థానికులు తెలియజేశారు. అలాగే విద్యుత్ వైర్లపై వేలాడుతున్న కొమ్మలను తుంచి తొలిగించారన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

బలిజిపేట: రోడ్డు భద్రత నియమాలను ప్రతి ఒక్కరూ పాటించాలని ఎస్సై సింహాచలం కోరారు. ఈమేరకు రోడ్డు భద్రత, మాదక ద్రవ్యాల వినియోగంపై వంతరాం రహదారిలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలను నడిపేటప్పుడు మద్యం తాగరాదని, సెల్‌ఫోన్లు వినియోగించరాదని, పరిమితికి మించి ప్రయాణికులను వాహనాల్లో ఎక్కించరాదని సూచించారు. ద్విచక్ర వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని అదేవిధంగా యువత మత్తుకు బానిసకాకూడని స్పష్టం చేశారు. యువతను సరైన మార్గంలో తల్లిదండ్రులు నడిపించాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

సాలూరు: స్థానిక పీఎన్‌బొడ్డవలస అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో మిగులుసీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పీఎస్ఎన్ మూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు మిగులుసీట్లు తక్షణ భర్తీ చేయనున్నామన్నారు. అర్హులైన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు పాఠశాలకు హాజరు కావాలని సూచించారు.

సాగులో సస్యరక్షణే కీలకం..



పొలంలో నాట్లు వేస్తున్న మహిళా రైతు, వేతనదారులు

- మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు

పాలకొండ రూరల్: వరి పంటలో అధిక దిగుబడులు సాధించాలంటే సస్యరక్షణ పాటించాలని వ్యవసాయాధికారులు తెలియజేస్తున్నారు. సరైన సమయంలో సస్యరక్షణ చర్యలు చేపట్టకపోతే దిగుబడులపై ప్రభావం ఉంటుందని, ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తుందని చెబుతున్నారు. ఇప్పటికే పెట్టుబడి సాయం ఆలస్యం కావడం, వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో రైతులు అప్పులు చేసి మరీ వరి సాగుకు పెట్టుబడి పెట్టారు. తోటపల్లి కాలువల ద్వారా టైలెండ్ భూములకు సాగునీరు అందడం లేదు. ఈ తరుణంలో అధిక దిగుబడులు సాధిస్తే తప్ప నష్ట నివారణ సాధ్యం కాదు. ఈ క్రమంలో వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటించడంతో పాటు సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాల్సిందే. ప్రస్తుత సీజన్‌లో వరుణుడి కరుణపై ఆధారపడుతున్న అన్నదాతలు సాగు మెలకువలు, తెగుళ్లు – వాటి నివారణా చర్యలపై అవగాహన కలిగి ఉండడం మేలని ఏఓ ప్రసాద్ తెలిపారు. ఈ నేపథ్యంలో సాగుకు సంబంధించి పలు సూచనలు చేశారు.

కాండం తొలుచు పురుగు..

నారుమడి నుంచి పూతదశ వరకు పైరుకు కాండం తొలుచు పురుగు ఆశిస్తుంది. దీంతో దిగుబడులు బాగా తగ్గిపోతాయి. పిలక దశలో మొవ్వ చనిపోవడం, పూత దశలో తెల్లకంకులు ఏర్పడడం జరుగుతుంది. దీని నివారణకు కార్టఫ్ హైడ్రోక్లోరైడ్ 2 గ్రాములను లీటర్ నీటిలో కలిపి తగినంత మోతాదులో పిచాకారీ చేసుకోవాలి. కార్బోఫ్యూరాన్ 3 గ్రాముల గుళికలు ఎకరాకు పది కిలోలు వాడాలి.

ఆకుముడత పురుగు..

గొంగళి పురుగు ఆకు ముడతలో ఉండి పత్రహరితాన్ని తినేయడం వల్ల ఆకులు తెల్లబడతాయి. దీని నివారణకు లీటర్ నీటిలో 2.5 ఎం.ఎల్ క్లోరిఫైరిఫాస్ కలిపి తగినంత మోతాదులో పిచికారీ చేసుకోవాలి.



నాట్లు వేసేందుకు నొల్లతో మడిని చదును చేస్తున్న రైతు

సుడిదోమ..

సుడిదోమ వ్యాపిస్తే పంట ఎండిపోతుంది. దీని నివారణకు ట్రై సైక్లోజోల్ 0.6 గ్రాములను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. అలాగే గట్లపై కలుపు నివారించుకోవాలి.

ఆకు ఎండుతెగులు నివారణ..

బ్యాక్టీరియా వల్ల ఆకు ఎండుతెగులు ఆశిస్తుంది. నత్రజని ఎరువులు తక్కువ పరిమాణంలో ఎక్కుసార్లు వేసుకోవాలి. పొలం ఆరబెడుతూ నీటి తడులు ఇవ్వాల్సి ఉంటుంది.

పొట్టకుళ్లు తెగులు..

ఈ తెగులు ఆశిస్తే వెన్నులు పొట్ట దశలోనే కుళ్లిపోతాయి. దీంతో పంటకు తీవ్ర నష్టం కలుగుతుంది. దీనిని నివారించేందుకు కార్బండజిమ్ 1.5 గ్రాములను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. పొట్ట దశలో ఒకసారి, వారం రోజుల తర్వాత రెండోసారి పిచికారీ చేసుకోవాలి.

నియోజకవర్గంలో సాగు వివరాలు

మండలం	సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)	రైతులు
పాలకొండ	6,345	12,901
వీరఘట్టం	7,112	14,201
సీతంపేట	3,079	9,173
భామిని	3,778	7,549

నీటియాజమాన్యం...

పిలకలు వేసే దశలో, పైరు దుబ్బు వేయడం పూర్తయ్యేవరకు పొలంలో 2 సెంటీమీటర్ల నీరు ఉండాలి. చిరు పొట్టదశలో, పూత దశలో పొలంలో 5 సెంటీమీటర్ల నీరు ఉండేలా చూసుకోవాలి. పంట పూర్తిగా వెన్ను వచ్చిన తర్వాత క్రమంగా నీరు తగ్గిస్తూ ఉండాలి.

ఎరువుల యాజమాన్యం..

భూసార పరీక్షను బట్టి రసాయన ఎరువులు, సేంద్రియ ఎరువులు, జీవన ఎరువులు వాడి పైరుకు సమతుల్యంగా పోషక ఎరువులు అందజేయాలి. ఎకరాకు నత్రజని 96 కిలోలు, భాస్వరం 32 కిలోలు, పొటాష్ 32 కిలోలు అందేటట్లు ఎరువులు వేసుకోవాలి.

జింక్ లోపం-నివారణ..

జింక్ లోపం ఉన్న వరి పంటలో 3 లేదా 4 ఆకుల్లో ఈనె పాలిపోతుంది. నాటిన 2 నుంచి ఆరు వారాల్లో ముదురాకు మధ్యలో ఈనెకు ఇరువైపులా తుప్పు రంగు మచ్చలు ఏర్పడి, ఆకు పెలుసుగా మారుతుంది. పైరు మీద జింక్ సల్ఫేట్ ద్రావణం తగినంత మోతాదులో పిచికారీ చేసుకోవాలి.

అవగాహన అవసరం..



వరి పంటలో అధిక దిగుబడులు సాధించాలంటే సస్యరక్షణ చర్యలు తప్పనిసరిగా చేపట్టాలి. సాగునీటి, ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటించాలి. మండల పరిధిలో ఉడుపులు దాదాపుగా పూర్తి కావచ్చాయి. ఇంకా ఉడుపులు చేయదలచిన రైతులు ఆ సమయంలో కాలిబాటలు వేసుకోవడం మేలు. చిన్నపాటి మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు.

– ప్రసాదరావు, మండల వ్యవసాయాధికారి, పాలకొండ

కూటమి ప్రభుత్వానికి పట్టని సంక్షేమం

- వైఎస్సార్‌సీపీ నాయకులు

సీతంపేట: కూటమి ప్రభుత్వానికి ప్రజా సంక్షేమం పట్టదని వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ నియోజకవర్గ కన్వీనర్ నిమ్మక కాంతారావు, నాయకుడు ఎస్.రాములు ఆరోపించారు. మండలంలోని మూర్తిగాడిగూడ, కడగండి పంచాయతీల్లో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ'కార్యక్రమాలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ వెళ్లి కూటమి నాయకులు చేస్తున్న మోసాలను వివరించారు. సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకపోవడంతో ఒక్కో కుటుంబానికి ఎంత నష్టం చేకూరినదీ తెలియాజేశారు. ఎండీయూ వాహనాలను రద్దు చేయడంతో ఏజెన్సీ ప్రాంత ప్రజలు రేషన్ సరుకులు తెచ్చుకోవడానికి ఎంతో ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. హామీలు అమలు చేయని కూటమి నాయకులను నిలదీయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ సవర రాజయ్య, ఎంపీటీసీ సభ్యుడు గణేష్, వార్డు సభ్యులు సవర గంగారావు, తిరుపతి, నాయకులు పి.కృష్ణారావు, సుంబురమ్మ, బోడయ్య, తదితరులు పాల్గొన్నారు.



మూర్తిగాడిగూడలో బాబు మోసాలను వివరిస్తున్న నాయకులు

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియామాలు పాటించి, ప్రమాదాల నివారణకు సహకరించాలని కురుపాం ఎస్ఐ పి.నారాయణరావు కోరారు. కురుపాం మండలంలోని మూలిగూడ జంక్షన్ వద్ద ఆదివారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన వాహనదారులకు పలు సూచనలు చేశారు. వాహనాలతో రోడ్డుపైకి వచ్చేటప్పుడు లైసెన్స్, వాహన ధ్రువపత్రాలు తప్పనిసరిగా వెంట తీసుకురావాలని సూచించారు. అలాగే పరిమిత వేగంతో ప్రయాణించాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, మద్యం తాగి, ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపవద్దన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఎక్కడైనా ఎవరైనా అక్రమంగా మద్యం విక్రయించినా, తరలించినా సమాచారం ఇవ్వాలని కోరారు.



వాహనదారులకు సూచనలిస్తున్న ఎస్ఐ నారాయణరావు

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

కొమరాడ: మండలంలోని దళాయపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పలువురు విద్యార్థులకు గంటేడ చిన్నమ్ములు స్మారక ప్రతిభా పురస్కారాలు ఆదివారం అందజేసి, సత్కరించారు. పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉలిపిరి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలకు చెందిన హిమరిక భవాని, కోటిపాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కె.లోకేష్, దళాయిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన వడ్డి హారికలకు రూ.2 వేల నగదు ప్రోత్సాహక బహుమతితో పాటు మెమెంటో, దుస్తులు అందజేశామని నిర్వాహకులు రిటైర్డ్ ఉపాధ్యాయుడు గంటేడ సోమేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో కథా రచయిత గంటేడ గౌరునాయుడు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థికి మెమెంటో అందజేసి, సత్కరిస్తున్న సోమేశ్వరరావు

విచ్చలవిడిగా పశువుల సంచారం

గుమ్మలక్ష్మీపురం: మండల పరిధిలోని ఎల్విన్‌పేట మూడు రోడ్ల జంక్షన్‌లో విచ్చలవిడిగా పశువుల సంచారం నెలకొంది. ప్రతిరోజూ సాయంత్రం గుంపులు గుంపులుగా పశువులు ఇక్కడకు చేరుకుని, తిష్టవేస్తున్నాయి. దీంతో వాహనదారులు రాకపోకలు సాగించలేకపోతున్నామని, పశువులు వాహనాలకు అడ్డం వచ్చినప్పుడు అప్రమత్తంగా లేకుంటే ప్రమాదం తప్పదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా, పశువులు ఇష్టారాజ్యంగా తిరుగుతుండడం వల్ల ట్రాఫిక్ సమస్య కూడా తలెత్తుతోందని వాపోతున్నారు. పశువుల యజమానులు వాటిని నిర్లక్ష్యంగా వదిలేయడంతోనే ఈ దుస్థితి నెలకొందని, పంచాయతీ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



ఎల్విన్‌పేట జంక్షన్‌లో సంచరిస్తున్న పశువులు

వైభవంగా సంతోషిమాత శోభాయాత్ర



బత్తిలో సరిహద్దుమాతను ఊరేగిస్తున్న భక్తులు

భామిని: ఆంధ్రా – ఒడిశా సరిహద్దుల్లో కొలువైన సరిహద్దు మాత (సంతోషి మాత) శోభాయాత్ర ఆదివారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారికి ఒడిశా, ఆంధ్రా భక్తులు సామూహిక పూజలు చేపట్టారు. యాత్రలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తాగునీటికి ఇక్కట్లు



శివారు వీధుల్లో రక్షిత కుళాయిల ద్వారా వస్తున్న కలుషిత నీరు

పాలకొండ రూరల్: నగర పంచాయతీ పరిధిలోని వీవర్స్ కాలనీ సమీపంలో ఉన్న రక్షిత మంచినీటి పథకం పాడవ్వడంతో ఆ ప్రాంత మహిళలు మూడు రోజులుగా తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. రక్షిత కుళాయిల ద్వారా నీరు రాకపోవడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లి నీరు తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. మరోవైపు కుళాయిల ద్వారా మురుగు, రంగు మారిన నీరు వస్తుండడంతో గొల్లవీధి, కోరాడ వీధి, కస్పావీధి, గాసీ వీధి, తదితర ప్రాంత వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కలుషిత నీరు వల్ల డయేరియా వంటి అంటువ్యాధులు, వైరల్ జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

కరుణించని వరుణుడు

భామిని: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో అన్నదాతల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. గడిచిన వారం నుంచి వర్షాలు లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో సాగు నీటి వనరులు లేక బోర్లపై ఆధారపడి సేద్యం చేపడుతున్నారు. ముఖ్యంగా భామిని నుంచి పెద్దదిమిలి వరకు నీటివసతి లేకపోవడంతో నేటికీ ఉడుపులు జరగలేదు. సింగిడి నుంచి బత్తిలి వరకు గల రైతులు బోర్లపై ఆధారపడి సాగు చేపడుతున్నారు. ఓ వైపు వర్షం పడక పంటలు ఎండిపోతుంటే.. మరోవైపు ఉడుపులు జరగకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఆదివాసీ ఆచార, సంప్రదాయాల పరిరక్షణకు కృషి

- ఆర్ట్స్ డైరెక్టర్ సన్యాసిరావు

సీతంపేట: ఆదివాసీ ఆచార, సంప్రదాయాల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆర్ట్స్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ నూక సన్యాసిరావు పిలుపునిచ్చారు. మండలంలోని ఓండ్రుజోలలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2002 నుంచి గిరిజన గ్రామాల్లో ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఆదివాసీ మేళా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గిరిజనుల జీవన విధానాలపై ఇంతవరకు ఆదివాసీ కాలచక్రం, సవర, జాతాపు సరాగాలు వంటి పుస్తకాలు ప్రచురించినట్లు తెలిపారు. రైతు ఉత్పత్తిదారుల కంపెనీలు ఏర్పాటు చేసి వారు పండించిన పంటలకు మద్దతు ధరలు కల్పించామన్నారు. ఆదివాసీల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దామన్నారు. కార్యక్రమంలో మన్యం సహజ ఉత్పత్తిదారుల సీఈఓ బి.శంకరరావు, కోఆర్డినేటర్ సందీప్, ఆదివాసీ మహిళా రైతు ఉత్పత్తిదారుల కంపెనీ ప్రతినిధి గౌతమి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్ట్స్ డైరెక్టర్ సన్యాసిరావు

● రారెత్తిస్తున్న శునకాలు..



నగర పంచాయతీలో ఎక్కడ చూసినా వీధి కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. చిన్నారులు, పాదచారులపై దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. ముఖ్యంగా కోమటిపేట, ప్రధాన మార్కెట్, దుర్గమ్మ దేవస్థానం కూడలి, ఆర్టీసీ కాంప్లెక్స్, పరిసరాలతో పాటు శివారు వీధుల్లో కుక్కల సంచారం ఎక్కువగా ఉంది. అధికారులు స్పందించి కుక్కల బెడద నుంచి రక్షణ కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

– పాలకొండ రూరల్

పవిత్ర కర్మలను ఆచరించాలి

పాలకొండ: ప్రతి ఒక్కరూ పవిత్రకర్మలను ఆచరించడం ద్వారా దైవానుగ్రహం పొందగలరని సత్యసాయి సేవా సమితి ప్రతినిధి ఎస్‌వీ రమణ అన్నారు. పట్టణంలోని నాగవంశపువీధిలో గల రామమందిరంలో దివ్యజ్ఞాన బోధన సత్సంగం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానవ జీవితం అశాశ్వతమన్న విషయం అందరూ తెలుసుకుని.. ఆధ్యాత్మిక చింతన అలవరుచుకోవాలని సూచించారు. అనంతరం భగవద్గీత పారాయణం చేపట్టారు. కార్యక్రమంలో ఆధ్యాత్మికవేత్తలు కంచుమోజు రామ్మోహనరావు, డి.యోగేశ్వరరావు, తుమ్మగుంట శంకరరావు, జల్లు నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు.



భగవద్గీత పారాయణం చేస్తున్న భక్తులు

ఘనంగా యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



యూటీఎఫ్ పతాకాన్ని ఆవిష్కరిస్తూ నినాదాలు చేస్తున్న ఉపాధ్యాయులు

వీరఘట్టం: యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని మండల కేంద్రంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఫెడరేషన్ సీనియర్ నాయకుడు ఎ. స్వామిబాబు పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కార్యదర్శి మజ్జి పైడిరాజు మాట్లాడుతూ.. యూటీఎఫ్ పోరాటాలు, వాటి ఫలితాలపై వివరించారు. యూటీఎఫ్ చేసిన పోరాటాల వల్లే ఎన్నో సమస్యలు పరిష్కామయ్యాయన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు కురమాన గోవిందరావు, బోనంగి దుర్గాప్రసాద్, ఎ.చంద్రమోహన్, ఎం.ముకుందరావు, కె.గోవిందరావు పాల్గొన్నారు.

టి.దత్తివలసను పట్టిపీడిస్తున్న విషజ్వరాలు

- విషజ్వరాల బారిన గ్రామస్తులు
- వారం రోజులైనా తగ్గని వైనం
- ప్రతి ఇంట్లో ఇద్దరు, ముగ్గురేసి రోగులు
- వైద్య శిబిరం కొనసాగించాలని విజ్ఞప్తి



కీళ్లనొప్పులతో బాధపడుతున్నామని వాపోతున్న జ్వర పీడితులు

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని చింతలబెలగాం పంచాయతీ, తుమ్మలదత్తివలస గ్రామాన్ని విషజ్వరాలు వణికిస్తున్నాయి. గతం వారం రోజులుగా గ్రామంలోని ప్రజలంతా వివిధ జ్వరాలతో బాధపడుతున్నారు. ప్రతి ఇంటికి ఇద్దరు, ముగ్గురు చొప్పున తీవ్రమైన జ్వరంతో బాధపడుతూ మంచానపడి ఉన్నారు. ఈ నేపథ్యంలో జియ్యమ్మవలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పి.జగదీష్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి, రక్త పరీక్షలు చేశారు. జ్వరపీడితులంతా వైరల్ జ్వరాలతో బాధపడుతున్నట్లు గుర్తించామని సదరు వైద్యాధికారి తెలిపారు. ఇదిలా ఉంటే జ్వరం బారినపడిన వారిలో ఏ ఒక్కరికీ మలేరియా, టైఫాయిడ్ జ్వరాలు లేవని స్పష్టం చేశారు. వారికి వచ్చిన జ్వరం ఒకట్రెండు రోజులు ఉండి, ఆ తర్వాత మందుల వాడకం ద్వారా క్రమేపీ తగ్గుతోందన్నారు. జ్వరం తగ్గినా 10 రోజుల వరకు కాళ్లు, ఒళ్లునొప్పులు ఉంటున్నాయని బాధిత ప్రజలు చెబుతున్నారు.

కాళ్లనొప్పులు వేధిస్తున్నాయి..

కాళ్లనొప్పుల కారణంగా కనీసం బహిర్భూమికి కూడా వెళ్లలేకపోతున్నామని జ్వరాలతో బాధపడుతున్న వారు వాపోతున్నారు. జ్వరం తగ్గినా ఒళ్లంతా నొప్పులు మాత్రం తగ్గడం లేదని సంబంగి ఎల్లంనాయుడు, దేవర సంగాం, త్రినాధ, గొట్టాపు కృష్ణ, చీపురుపల్లి శ్రీను, దేవర సోములు, ఏగిరెడ్డి సింహాచలమ్మ, ప్రసాద్, రమేష్‌లు చెబుతున్నారు. గ్రామస్తులంతా ఒక్కొక్కరుగా అస్వస్థతకు గురికావడం వెనక కారణాలపై అన్వేషిస్తున్నారు. తాగునీటి వల్ల వచ్చిందా లేకుంటే చికెన్‌గున్యానా అనే కోణంలో గ్రామస్తులు ఆలోచిస్తూ ఆందోళన చెందుతున్నారు. వైద్యాధికారులు స్పందించి, గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించి, కొనసాగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

● సన్మార్గంలో నడవాలి..



ఫాదర్ ధనరాజ్‌ను సత్కరిస్తున్న యువత

పాలకొండ రూరల్: ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడవాలని ఫాదర్ ధనరాజ్ సూచించారు. మండలంలోని చిన్నమంగళాపురం ఆర్‌సీఎం చర్చిలో జాతీయ యువజన ఆదివారం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. లోక రక్షకుడు క్రీస్తు బోధనలను యువత అనుసరించి, ఆదర్శవంతమైన జీవనం సాగించాలని కోరారు. అనంతరం జీసస్ యువతనుద్దేశించి చేసిన బోధనలు గుర్తు చేశారు. కార్యక్రమంలో చిన్న, గొట్టమంగళాపురం, యరకారాయపురం గ్రామాల యువతీ, యువకులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.